# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 16-05-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ పేదల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని బీజేపీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ❖ సార్వత్రిక ఎన్నికల్లో సమష్టి కృషితో సేవలందించిన అధికారులను విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.మల్లికార్జున అభినందించారు.
- ❖ జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని ఈరోజు దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నాము.
- ❖ రాష్ట్రంలో రానున్న మూడు రోజుల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడిచింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

పేదల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ రోజు ఉత్తర ప్రదేశ్ లోని అజాంఘడ్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ప్రసంగిస్తూ, 50 శాతం బడ్జెట్‌ను మైనారిటీలకు ప్రభుత్వం కేటాయిస్తామని తెలియజేశారు. నాలుగవ దశలో జరిగిన పోలింగ్‌లో శ్రీనగర్ ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారని వ్యాఖ్యానించారు. ఉత్తర ప్రదేశ్‌లో ఉన్న శరణార్థులకు పౌరసత్వం లభిస్తుందని నరేంద్రమోదీ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లాలో అందరూ సమష్టి కృషితో సేవలందించారని విశాఖ జిల్లా ఎన్నికల నిర్వహణ అధికారి, కలెక్టర్ డాక్టర్ ఏ మల్లికార్జున తెలిపారు. ఇదేవిధంగా కౌంటింగ్ ప్రక్రియలోనూ అధికారులు పని చేయాలని సూచించారు. ఈ రోజు కలెక్టరేట్ లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈవీఎంలు, స్ట్రాంగ్ రూమ్‌ల కోసం బద్రత ఏర్పాట్లు, పోస్టల్ బ్యాలెట్లను వేరు చేయడం వంటి వాటి పై దృష్టి సారించాలని ఏవీ సారించాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ నాటికి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

=====================

నైరుతి రుతుపవనాలు ఈ నెల 19 నాటికి దక్షిణ అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలు, నికోబార్ దీవులలోకి ప్రవేశించే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దక్షిణ కర్ణాటక నుంచి తూర్పు విదర్భ వరకు ఏర్పడిన ద్రోణి సముద్రంలో బలహీన పడిన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, యానాంలో రానున్న మూడు రోజులలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్ర అధికారి పేర్కొంటూ.....

(వాయిస్ 35 సెకన్లు)

=====================

ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరిని శ్రీకాకుళం జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలాని సమూన్ అభినందించారు. అధికారుల సమన్వయం, సమిష్టి కృషితోనే సాధ్యమైందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈరోజు కలెక్టరేట్‌లో ఆయన ప్రత్యేకంగా ఆర్వోలు, నోడల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లాలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడం చాలా సంతోషకరమని కలెక్టర్ పేర్కొన్నారు.

=====================

అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో ప్రవేశపెట్టిన ఐటీ నైపుణ్య కోర్సులపై విద్యార్థులకు 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి శిక్షణ ఇచ్చేందుకు జిల్లా వ్యాప్తంగా 270 పాఠశాలలను ఎంపిక చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు తెలిపారు. ప్రతి 3 పాఠశాలలకు ఒక నైపుణ్యత నిపుణుడిని నియమించి, వచ్చే జూన్ నుంచి వీరు విద్యార్థులకు సాంకేతిక అంశాలపై శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ క్రమంలో గిరిజన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

=====================

ఈరోజు మధ్యాహ్నం 3 గంటలకు సికింద్రాబాద్ లో బయలుదేరాల్సిన సికింద్రాబాద్ - విశాఖపట్నం వందే భారత్ ఎక్స్ ప్రెస్ రాత్రి 8 గంటలకు బయలుదేరుతుందని రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలియజేశారు. దీని జత రైలు ఆలస్యంగా నడుస్తున్న కారణంగా ఈ మార్పు చేయడం జరిగిందని, ప్రయాణీకులు గమనించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

విరామం

=====================

జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం ప్రతి సంవత్సరం మే 16వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించుకుంటున్నాము. ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఈ దినోత్సవాన్ని ప్రారంభించింది. తొలిసారిగా 2010లో మొదలై ప్రతి సంవత్సరం డెంగ్యూ జ్వరంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది దీని బారినపడి మరణిస్తున్నారు. ఈ నేపథ్యంలో డెంగ్యూ నివారణకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఆరోగ్య సేవలకు దూరంగా ఉన్న కొండ ప్రాంతాలు, సరిహద్దు ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలు ఆరోగ్య పురోగతిలో వెనుకబడిన గ్రామాలకు ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తుంది. దోమల వల్ల సోకే వ్యాధులు, వాటి నియంత్రణ, సమాజంలో నీటి నిల్వ

పద్ధతులు, స్వీయ రక్షణ పద్ధతులు, స్వచ్ఛమైన వాతావరణం, తాగునీటి ప్రాధాన్యత గురించి సమాజంలో అవగాహన కల్పించడం వంటి చర్యలతో డెంగ్యూ నివారణకు ప్రభుత్వం కృషి చేస్తోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

డెంగ్యూ వ్యాధి నివారణలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి కె. విజయపార్వతి, జిల్లా మలేరియా అధికారి టి. జగన్మోహనరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు వైద్య సిబ్బందితో కలసి వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జాతీయ డెంగ్యూ దినోత్సవం కార్యక్రమాన్ని ఈరోజు నిర్వహించారు. దోమల నివారణకు ప్రజలు ముందుకు రావాలన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ మండలం సిద్ధాంతం రోడ్డులో ఈరోజు ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. ఇద్దరు మహిళలు, ఒక బాలుడు స్కూటీపై వెళ్తుండగా బండి అదుపు తప్పడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఒక మహిళా అక్కడే మృతి చెందగా, మరో మహిళలకు తీవ్ర గాయలవగా, బాలుడుకి స్వల్ప గాయాలతో అయ్యాయి. వారిద్దరిని స్థానిక ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

తిరుపతిలోని గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తిరుమల వెంకటేశ్వరస్వామికి సోదరుడిగా భావించే గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహించడం తిరుమల తిరుపతి దేవస్థానం ఆనవాయితీగా వస్తుంది. ఈరోజు ఉదయం గోవిందరాజస్వామి ఆలయంలో ధ్వజారోహణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకు ముందు ధ్వజస్తంభానికి సుగంధ పరిమళ ద్రవ్యలతో అభిషేకాలను నిర్వహించి ధ్వజపటానికి నివేదన, మహా మంగళ హారతులు సమర్పించారు. తొమ్మిది రోజులపాటు ఈ బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ ఈఏపి సెట్-2024 ఆన్ లైన్ ప్రవేశ పరీక్ష ఈ రోజు రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైనట్లు ఏపి ఈఏపి సెట్ ఛైర్మన్, ఉపకులపతి ప్రొఫెసర్ జి.వి.ఆర్.ప్రసాదరాజు తెలిపారు. ఈరోజు కాకినాడలోని జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం అధికారులు, ఏపి ఈఏపిసెట్ కన్వీనర్ కె. వెంకటరెడ్డి, కో-కన్వీనర్లు, కో-ఆర్డినేటర్లతో కలిసి ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు పరీక్ష నిర్వహణను పరిశీలించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల అనంతరం జరిగిన హింసాత్మక ఘర్షణలపై వివరిచేందుకు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి జవహర్‌రెడ్డి, డీజీపీ హరీస్ గుప్తా ఈరోజు కేంద్ర ఎన్నికల సంఘం అధికారులను కలిశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రజల భాగస్వామ్యంతోనే డెంగ్యూ వ్యాధి నివారణ సాధ్యమవుతుందని శ్రీకాకుళం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ బి.మీనాక్షి పేర్కొన్నారు. ఈ రోజు జాతీయ డెంగ్యూ దినోత్సవంలో భాగంగా జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, డెంగ్యూ వ్యాధి నివారణకు చేపట్టవలసిన జాగ్రత్తలు గురించి అవగాహన పెంచుకోవడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు.

======================

======================